# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 16-06-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్ర వ్యాప్తంగా 2 కోట్ల మంది యోగా దినోత్సవంలో పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
- ❖ ఎన్డీయే కూటమి గత 11 సంవత్సరాలుగా అవినీతి రహిత పాలన అందిస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు డి.పురంధేశ్వరి పేర్కొన్నారు.
- ❖ పేదలకు ఆర్థిక సహాయాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన P4 కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని బాపట్ల జిల్లా కలెక్టర్ జె.వి.మురళి అన్నారు.
- ❖ రాగల 24 గంటల్లో రాష్ట్రంలో పలుచోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది.

=========================

రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 21వ తేదీన విశాఖపట్నంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం ఏర్పాట్లను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పరిశీలించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ హాజరుకానున్న నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతోంది. ఈ ఏర్పాట్లను యోగాంధ్ర నోడల్ అధికారి ఎం.టి. కృష్ణబాబు, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ముఖ్యమంత్రికి వివరించారు. ఆర్కే బీచ్, ఆంధ్రా విశ్వవిద్యాలయం మైదానంతో సహా వివిధ ప్రాంతాల్లో చేసిన ఏర్పాట్లను ముఖ్యమంత్రి స్వయంగా పరిశీలించారు. అనంతరం జరిగిన సమీక్షలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... యోగా డే కార్యక్రమంలో పాల్గొనే వారితో మాక్ యోగా నిర్వహించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ట్రాఫిక్ కు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్ లక్ష్యంగా కోట్లమంది అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనేలా ఏర్పాట్లు చేశామని ముఖ్యమంత్రి వెల్లడిస్తూ...

(వాయిస్ 38 సెకన్లు)

=========================

పేద ప్రజలను దృష్టిలో ఉంచుకొని వికసిత్ భారత్ 2047 లక్ష్యాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్దేశించారని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. ప్రభుత్వ సుపరిపాలన, పేదల సంక్షేమంపై ఈరోజు రాజమహేంద్రవరంలో ఆమె సమీక్ష నిర్వహించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ... ప్రజలు తమపై నమ్మకంతోనే మూడుసార్లు ఎన్డీయే కూటమిని గెలిపించారని చెప్పారు. గతంలో కేవలం ఏడు కోట్ల మంది మాత్రమే బ్యాంకింగ్ రంగానికి దగ్గరగా ఉండేవారని, ప్రస్తుతం 52 కోట్ల మందికి ఆ సేవలు అందుతున్నాయని వెల్లడించారు. దేశవ్యాప్తంగా 15 కోట్ల మందికి "జల్ జీవన్ మిషన్" కింద మంచినీటి సరఫరా జరుగుతోందన్నారు. గత 11 సంవత్సరాలుగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం అవినీతి రహిత పాలన అందిస్తోందని పురందేశ్వరి పేర్కొంటూ...

(వాయిస్ 32 సెకన్లు)

=========================

సమాజంలో పేదలకు ఆర్థిక సహాయాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అందించిన P4 కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని బాపట్ల జిల్లా కలెక్టర్ జె.వి.మురళి అన్నారు. P4 కార్యక్రమం కింద 13 బంగారు కుటుంబాలకు కలెక్టర్ ఈ రోజు 10 లక్షల 95 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని వివిధ రూపాల్లో అందచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... సమాజంలో ఆర్థికంగా ఉన్నత స్థానంలో ఉన్నవారు పారదర్శకంగా నిరుపేదలకు సహాయం చేసేందుకు P4 కార్యక్రమం ద్వారా అవకాశం కలుగుతుందన్నారు. జిల్లాలో 62 వేల నిరుపేద కుటుంబాలకు సహాయం చేసేందుకు 6 వేల మంది మార్గదర్శకులలో గెజిటెడ్ ఆఫీసర్లు, బ్యాంకర్లు కూడా కూడా ఉన్నారని తెలిపారు.

=========================

గ్రామాల్లో పేదరిక నిర్మూలన కోసం తీసుకొచ్చిన గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)ను మహిళలు ఓ ఉద్యమంలా ముందుకు తీసుకెళ్తున్నారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. గతంలో వెలుగు అనే ఓ కార్యక్రమాన్ని చేపట్టగా.. అది కాలక్రమేనా సెర్ప్‌గా రూపాంతరం చెందిందన్నారు. సెర్ప్ మొదలై ఈరోజుతో 25 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా గ్రామీణ మహిళలకు, సెర్ప్ ఉద్యోగులకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రి అభినందనలు తెలియజేశారు.

విరామం

=========================

రాష్ట్రంలో విద్యారంగాభివృద్ధికి ప్రభుత్వం పలు సంస్కరణలు చేపట్టిందని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అన్నారు. అమలాపురంలో శ్రీ గోపాలకృష్ణ గోఖలే పురపాలక ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు విద్యామిత్ర కిట్లను కలెక్టర్ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగ పరుచుకుని ఉజ్వల భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకుంటూ ఆశయ సాధన దిశగా ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా 'మనబడి మన భవిష్యత్' కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో చేపట్టిన నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు.

=========================

కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాల సద్వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని నరసరావుపేట పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. పల్నాడులోని కలెక్టర్ కార్యాలయంలో ఈ రోజు నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ (NLM) PMEGP వంటి 7 కేంద్ర ప్రభుత్వ ప్రాజయోజిత పథకాలపై ఎంపీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సంవత్సరాల నుండి పథకాల కోసం దరఖాస్తు చేసుకున్న వారిని పిలిచి, బ్యాంకర్లతో నిర్వహించిన ఈ సమీక్ష ఫలవంతంగా ఉందని, ఇక నుండి ప్రతినెలా రెండు సోమవారాల పాటు క్రమం తప్పకుండా ఈ సమీక్ష నిర్వహిస్తానని తెలిపారు. నిరుపేదలకు, వ్యాపారస్తులకు లబ్ది చేకూరేలా కేంద్ర ప్రభుత్వం రూపొందించి, అమలు చేస్తున్న పథకాలు లబ్దిదారులకు చేరేలా ప్రజా ప్రతినిధులు స్వయంగా పర్యవేక్షిస్తూన్నారని కృష్ణదేవరాయలు వివరిస్తూ...

(వాయిస్ 27 సెకన్లు)

=========================

ఢిల్లీలోని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న శ్రీ వేంకటేశ్వర (ఎస్‌వీ) కళాశాలలో తెలుగు విద్యార్థులకు అడ్మిషన్ల కోటాలో ప్రాధాన్యత ఉండేలా చర్యలు తీసుకోవాలని టిటిడి ఛైర్మెన్ బీ.ఆర్.నాయుడు అన్నారు. తిరుపతి శ్రీ పద్మావతీ అతిథి గృహంలో టీటీడీ ఈవో జె. శ్యామలరావు గవర్నింగ్ బాడీ సభ్యులతో ఈరోజు ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్వీ కళాశాల గవర్నింగ్ బాడీ ఛైర్మెన్ గా బీఆర్ నాయుడు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా టిటిడి ప్రతిష్టతను మరింత పెంచేలా ఢిల్లీ శ్రీ వేంకటేశ్వర కళాశాలను రూపొందించాలని అధికారులను ఛైర్మెన్ కోరారు. కళాశాలలో అవసరమైన మౌళిక సదుపాయాల పనులను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థులకు పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చేలా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

=========================

వర్షాకాలంలో ప్రబలే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పార్వతీపురం మన్యం జిల్లా డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ కె.వి.ఎస్ పద్మావతి అన్నారు. ఈరోజు డోకిశీల మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎనీమియా యాక్షన్ కమిటీ సమావేశం ప్రతి నెల మొదటి బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల ప్రతి సచివాలయంలో తప్పనిసరిగా జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. గర్భిణీల రిజిస్ట్రేషన్ సక్రమంగా చేయాలని, ఆబా ఐడిలను నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. క్షేత్ర స్థాయిలో ఫీవర్ సర్వే చేపట్టి జ్వరాలు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు.

=========================

కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్ ఈరోజు తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో కేంద్ర మంత్రి స్వామివారి సేవలో పాల్గొన్నారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను వారికి అందజేశారు.

=========================

దేశ సంస్కృతిలో భాగమైన యోగాను భారత్ ప్రపంచ దేశాలకు పరిచయం చేసిందని రాష్ట్ర మైనార్టీ, న్యాయ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలలో భాగంగా నంద్యాలలో సామూహిక యోగ కార్యక్రమాన్ని నిర్వహించారు.

=========================

వాయువ్య బంగాళాఖాతం పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని, తూర్పు మధ్యప్రదేశ్ నుండి బంగ్లాదేశ్ వరకు ద్రోణి కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ప్రభావంతో రాగల 24 గంటలలో రాష్ట్రంలో ఒక మోస్తరు వర్షాలు పలు చోట్ల కురిసే అవకాశముందని తెలిపింది.

=========================

=========================